క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

శృంగవరపుకోట: ఏపీఎస్ ఆర్టీసీ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధ వారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 45 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌తో పాటు గ్యారెజీ, ట్రాఫిక్ సిబ్బంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థిని ప్రతిభ



తేజేశ్వరి

లక్కవరపుకోట: జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో మండలంలోని జమ్మాదేవిపేట సమీపం లోని జ్యోతీరావుపూలే గురుకుల బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఆర్.తేజేశ్వరి ప్రథమ స్థానం సాధించింది. ఆడపిల్లలను రక్షించండి' అనే అంశంపై జిల్లా కేంద్రం విజయనగరంలో గత నెల 28న నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని తేజేశ్వరి ప్రతిభకనబరిచిందని ప్రిన్సిపాల్ యు.విజయకుమార్‌పాత్రో బుధవారం తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ సింహాద్రి నాయుడు

శృంగవరపుకోట: రాజమండ్రిలో గతనెల 28,29,30వ తేదీల్లో ఏపీ స్టేట్ మినీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన ఎస్.యశోవర్ధన్, విజయనగరానికి చెందిన శ్రీమంత్ జోడీ అండర్-9 కేటగిరి డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని కోచ్ ఎం.ప్రసాద్ తెలిపారు. క్రీడాకారులను సీఐ సింహాద్రి నాయుడు, అకాడమీ వ్యవస్థాపకుడు సూర్యనారాయణ తదితరులు బుధవారం అభినందించారు.

తాగునీటి కుళాయిల పరిశీలన



కుళాయిలను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, అధికారులు

వేపాడ: మండల కేంద్రంలోని గౌరమ్మ వీధిలో రూ.2 లక్షలతో ఇటీవల ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎంపీడీఓ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.దేవి బుధవారం పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడు తూ గౌరమ్మ వీధిలో తాగునీటి సమస్యను స్థానిక మహిళలు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సచివాలయానికి కేటాయించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.20 లక్షల నుంచి రూ.2 లక్షలు వెచ్చించి 20 కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్, వార్డు మెంబర్ మిరపాక రమణ తదితరులు పాల్గొన్నారు.

మునగ మొక్కలు, పెరటి కోళ్ల పంపిణీ



మహిళలకు మునగ మొక్కలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట:

మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో మహిళలకు వెలుగు ఆధ్వర్యంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు బుధవారం మునగ మొక్కలు, పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. వెలుగు ఏపీఎం అప్పలనాయుడు మాట్లాడుతూ కళ్లేపల్లిలో ఒక్కో మహిళకు 5 మునగ మొక్కలు చొప్పున వెయ్యి మందికి అందజేశామని, అలాగే 10 యూనిట్‌ల పెరటి కోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ గోకేడ ముసలినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తూర్పాటి అప్పలరాజు, బోకం అప్పారావు, భూమిరెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను మూడున్నరేళ్లలోనే సీఎం జగన్ అమలు చేశారని అన్నారు. పథకాలు పారదర్శకంగా అందుతున్నాయా లేదా అని నేరుగా ప్రజలనే అడిగి తెలుసుకోమని చెప్పి ఎమ్మెల్యేలను గడప గడపకూ సీఎం పంపిస్తున్నారని చెప్పారు. జగనన్న అమ్మవడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకా లకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే వలంటీర్ తలుపుతట్టి సామాజిక పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని చెప్పారు. పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని అంతా ఆశీర్వదించాలని కోరారు. పేదలకు మేలు జరుగుతుంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని, ప్రభుత్వంపై రోజూ లేనిపోని ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ డోలా కనకమహాలక్ష్మి, నాయకులు అల్లు మహాలక్ష్మినాయుడు, శానాపతి చంద్రరావు,తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

చీపురుపల్లి రూరల్(గరివిడి): పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వ దించాలని గరివిడి మండల వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాపతినిధులు, నాయకులు కోరారు. గరివిడి మండలంలోని గొట్నంది గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నా యా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, కాపుశంభం పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, గేదెల శంకరరావు, యల్లాంటి పోలీస్‌నాయుడు, స్థానిక సర్పంచ్ లోపింటి రాంబాబు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన గొల్జాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: కాకినాడ పి.ఆర్.డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గత నెల 28వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని గొల్జాం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బాలికలు, బాలురు విభా గాలు రెండింటిలోనూ విజయనగరం జిల్లా జట్లు విజేతలగా నిలిచాయని హెచ్‌ఎం కె.లక్ష్మి బుధవారం తెలిపారు. జిల్లా బాలిక లు, బాలుర జట్లకు పాఠశాల నుంచి ప్రాతినిధ్యం వహించిన 9వ తరగతి విద్యార్థులు వై.హరిత, కె.గౌతం ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించారని హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థులతో పాటు పీడీ ఆర్.జగదీశ్వరరావు, పీఈటీ ఎం.సురేంద్రను ఉపాధ్యాయులు అభినందించారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ఆ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ ఏ.వేదవతి సూచించారు. బిల్లలవలస గ్రామంలోని చెరువులో చేపడుతు న్న ఉపాధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని దినాలు పూర్తికాని వేతన దారులకు మార్చి నెలాఖరులోగా మిగిలి న పని దినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. పనిప్రదేశంలో తప్పని సరిగా తాగునీరు, నీడ సౌకర్యం, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆమె వెంట ఏపీఓ బి.కృష్ణవేణి ఉన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి



ఉద్యానవన పంటల సేకరణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని పోరలి గ్రామంలో ఉద్యానవన శాఖ నిధులు రూ.15 లక్షల తో నిర్మించనున్న ఉద్యానవన పంటల సేకరణ కేంద్రం భవనానికి వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గ్రామాల్లోనే రైతు భరోసాకేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామని, ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్యా నవన పంటల సేకరణ కేంద్రం భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సర్పంచ్ మిత్తిరెడ్డి ధనలక్ష్మి, ఉద్యాన వనశాఖ ఏడీ శైలజ, వెలుగు ఏపీఎం అచ్యుతరావు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో వల్లాపురం బాలిక ప్రతిభ



కాంస్యపతకం సాధించిన విద్యార్థి దేవిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

గుర్ల: మండలంలోని వల్లాపురం హైస్కూల్ విద్యార్థిని రెల్లి దేవి జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాణించి కాంస్యం పతకం సొంతం చేసుకుంది. అనకాపల్లిలో గత నెల 22 నుంచి 25 వరకు జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభచూపి ఆంధ్రా జట్టును మూడో స్థానంలో నిలిపింది. కాంస్య పతకం సాధించిన బాలికను ఆ పాఠశాల హెచ్‌ఎం అప్పారావు, పీడీ ఎం.తిరుపతిరావు బుధవారం అభినందించారు.

మండల పరిషత్ నూతన కార్యాలయం సందర్శన



మండల పరిషత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మండల కేంద్రానికి సమీపంలోని ఎం.వెంకటాపురం జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాలను ఇటీవలే మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం సందర్శించారు. సిబ్బంది గదులను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడి, నూతన భవనాల్లో సదుపాయాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కర్రి రామునాయుడు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

కొత్తవలస: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ కొరుపోలు అప్పారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కుమ్మరిబంజిరి సమీపంలోని విశ్వనాథస్వామి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని రక్షించడానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనాలని సూచించారు. అనంతరం ధర్మనిధి పుస్తకాలు,కరపత్రాలను ఆవిష్కరించారు. విశ్వనాథస్వామి ఆలయ ధర్మకర్త శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్మనిధి పుస్తకాలు,కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అప్పారావు, తదితరులు

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ



బొండపల్లి: బొండపల్లిలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ రవి,పోలీస్ సిబ్బంది

ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు జరిగినా ప్రాణాలకు ముప్పు ఉండదని పోలీసు అధికారులు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై పోలీసులు బుధవారం అవగాహన బైక్ ర్యాలీలు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

– గంట్యాడ, బొండపల్లి, వేపాడ, లక్కవరపుకోట,మెరకముడిదాం, శృంగవరపుకోట



వేపాడ: వేపాడలో ఎస్‌ఐ రమేష్ నేతృత్వంలో ర్యాలీ చేస్తున్న వాహన చోదకులు



మెరకముడిదాం: గర్భాం జంక్షన్ వద్ద ఎస్‌ఐ నవీన్‌పడాల్, పోలీసుల ర్యాలీ



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వర్ , పోలీసులు



గంట్యాడ: ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు



లక్కవరపుకోట: అరకు-విశాఖ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ ముకుందరావు, పోలీసులు

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

దత్తిరాజేరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధించడమే లక్ష్యంగా, రెండోసారి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే బాధ్యతగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు అధ్యక్షతన మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మండల కేంద్రంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని పర్యవేక్షించాలని, కొత్తగా మంజూరైన పథకాలను వలంటీర్లతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వా త ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలు, అబద్ధాలను తిప్పికొట్టాలని సూచించారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు, ఇళ్లు అందిస్తున్న తీరును, విద్య, వైద్య రంగాలతో పాటు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని చెప్పారు. ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు అప్పలనాయుడు, రమేష్ పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ ఆర్.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మండలంలోని ముమ్మనవానిపాలెం అంగన్ వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు (ఎస్సీ), కర్రిచిన్నయ్యపాలెంలో హెల్పర్ పోస్టు (బీసీ-బి) ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఆయా గ్రామాలకు చెందిన పదోతరగతి ఉత్తీర్ణులైన, 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వివాహిత మహిళలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కుమ్మరిబంజిరి వద్ద గల వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా కానీ, పోస్టు ద్వారా కాని అందజేయాలని పేర్కొన్నారు.

గుర్ల మండలంలో...

గుర్ల: మండలంలోని మణ్యపురిపేట, కలవచర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు, గొల్లపేట, సదానందపురం మినీ అంగన్‌వాడీ కేంద్రా ల్లో కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నెల్లిమర్ల ఐసీడీఎస్ పీఓ సత్యవతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈనెల 10వ తేదీలోగా నెల్లిమర్లలోని ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భీష్మ ఏకాదశి పూజలు



గజపతినగరం: భక్తులతో పూజలు చేయిస్తున్న అర్చకులు



శృంగవరపుకోట: గాయత్రీదేవి ఆలయంలో నవనీతసేవలో మలయప్పస్వామి

గజపతినగరం: స్థానిక రామాలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

గీతా సమాజంలో..

గుర్ల: మండలంలోని పెనుబర్తి గీతా సమాజంలో కృష్ణం వందే జగద్గురంసంస్థ వ్యవస్థాపకులు స్వామి సత్యానంద భారతి ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంతోషిమాత అమ్మవారిని ఊరేగించారు. అనంతరం సత్యానంద భారతి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సర్పంచ్ తుమ్మగుంటి మాధవి, అంబల్ల చిన్నారావు, రెడ్డి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవి ఆలయంలో...

శృంగవరపుకోట: స్థానిక గాయత్రీ దేవి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.అర్చకులు స్వామివారికి నవనీత సేవ చేశారు.

సంక్షిప్తంగా...


నేడు బిల్లలవలసలో 'గడప గడపకు మనప్రభుత్వం'

మెరకముడిదాం: మండలంలోని బిల్లలవలస గ్రామంలో గురువారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శన

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీని (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) ఎంపీపీ సత్యవంతుడు, అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, సర్పంచ్ బాలబాబు ఎంపీపీ వెంట ఉన్నారు.

దివ్యాంగుడు అదృశ్యం



రాము (ఫైల్)

శృంగవరపుకోట: పట్టణంలోని భవానీ ఐటిఐ సమీపానికి చెందిన దివ్యాంగుడు మీసాల రాము (చెవిటి,మూగ) (40) గత నెల 12వ తేదిన అదృశ్యం కావడం తో ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తారకేశ్వర్ తెలిపారు. రాము గత నెల 12వ తేదిన ఇంట్లో నుంచి ఖాకీ రంగు షర్టు ధరించి సైకిల్‌పై వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ రోజు నుంచి చుట్టు పక్క గ్రామాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియలేదని కుటుంబ సభ్యులు చెప్పారని ఎస్‌ఐ తెలిపారు. రాము ఆచూకి తెలిసిన వారు ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు

కొత్తవలస రూరల్: మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినవారికి బుధవారం నోటీసులు అందించామని ఈఓపీఆర్‌డి కె.ధర్మారావు తెలిపారు. ఉత్తరాపల్లికి చెందిన ఇమ్మంది కుమారి, మాడెం శివ అనే ఇరువురు వేరొకరి స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నట్లు నిర్ధారణ కావడంతో హైకోర్టు తీర్పు మేరకు రెండు నెలల్లో ఇళ్లను తొలగించి, స్థలం అసలు యజమానులకు అందించాలని ఆదేశాలు జారీ చేస్తూ నోటీసులను ఇళ్లకు అతికించామని ఈఓపీఆర్డీ పేర్కొన్నారు.

పైలేరియా నిర్మూలనకు కృషి

చీపురుపల్లి: పైలేరియా(బోద వ్యాధి) నిర్మూలనకు కృషి చేస్తున్నామని కర్లాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సువర్ణ తెలిపారు. కర్లాం పీహెచ్‌సీ పరిధిలోని చీపురుపల్లి మేజర్ పంచాయతీలో జి.అగ్రహారం, రిక్షా కాలనీ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రజలకు పైలేరియాపై అవగాహన కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో 320 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. రక్త నమూనాలను పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపించామని, ఎవరికైనా వ్యాధినిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు జాగ్రత్తలను సూచిస్తామని వైద్యాధికారి చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీఈఓ ఎల్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా రామాలయం ప్రతిష్ట



బొండపల్లి: ఆలయ గోపురంపై కలశ స్థాపన పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో రామాలయ ప్రతిష్టోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను వేదపండితుల సమక్షంలో గ్రామస్తులు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు వేద పండితులు పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. సర్పంచ్ కర్రి సత్యవతి,మాజీ సర్పంచ్ జి.కన్నం నాయుడు,నాయకులు కర్రి కృష్ణ ,పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో పూజలు చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో మూడురోజుల పాటు నిర్వహించిన కోదండరామాలయం పునః ప్రతిష్ట ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్టాపన అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు శివరామరాజు కొండరాజు, ప్రసాద్ రాజు, కృష్ణంరాజు, స్థానిక సర్పంచ్ బేత శ్రీదేవి, బాలి జయమ్మ నాయకులు,బేత రవి,బాలి తిరుపతి పాల్గొన్నారు.